# మా తెలివి

క్రిందటి డిశెంబరులో ఇచ్చిన శలవులలో ఒక్కతమాషాచేశాం ఇప్పటికీ దానిని తల్చుకొని మా తెలివికి మేము గర్విస్తూ వుంటాం. దీన్ని చదివి చెప్పండి- మేం చేసిన వని గర్వపడదగినదో కాదో

శలవుల్లో ఏమీ తోచటంలేదు. ఎనిమిదిగంటలకి కాఫీ, టిఫిను ముగించుకుని నేనూ, 6 V సుబ్బారావు (అంటే అది వాడి 'నిక్ నేమ్' లెండి. అసలుపేరు V వీర వెంకట వేణుగోపాల సుబ్బారావు మేము మిగిలిన రెండు 'V'లు చేర్చి, V వీర వెంకట వెర్రివెధవ వేణుగోపాల సుబ్బారావు అని పిలిచేవాళ్లం) V S భయ్యా (V సుబ్బయ్య) సూర్యారావు, నలుగురమూ రెండు సైకిళ్ళమీద, డబుల్సు రైడింగుచేస్తూ, అంటే శాసనోల్లంఘనం చేస్తూ, బయల్దేరాం తిరిగి, తిరిగి అలిసిపోయి, ఇంటికి వచ్చేస్తున్నాం మెయిన్ రోడ్డుమీదకి వచ్చేసరికి విజిల్ మోత వినిపించింది వెనక్కిచూచేసరికి ఒక ఎర్రబుట్ట తలాడిస్తూ నిల్చుంది. మా ప్రాణాలు ఎగిరిపోయాయి "ఏదో కాలేజీలో చదువుతున్నాం కదా! పిలిస్తే వెళ్ళకపోవటం మర్యాదలక్షణం కాదు కాలేజీ పేరుకి అప్రతిష్ట" అనుకుని వెళ్లాం మా భయ్యా "ఒరే! తప్పుపేర్లు చెపుదాంరా!" అన్నాడు సుబ్బారావు (విడువీలుగావుంటే పౌరశిక్షణనే తన అభిమానసబ్జక్టుగా తీసు

**కె. వి. ఎస్. ఎం. శర్మ**

కొని వుండేవాడు) "తప్పు చేసిన తర్వాత తప్పుపేర్లు చెప్పడం మరో తప్పు మన స్వతంత్ర భారతదేశంలోని విద్యార్థుల మనస్తత్వం యిట్లా వున్నదంటే చాలా విచారించదగిన . . " అని ఇంకా ఏమో చెప్పుకుని పోతున్నాడు నేను "కాస్త గ్రాన్ని కట్టెయ్యరా బాబూ" అన్నాను సూర్యారావుకి ముఖంలో నెత్తురు చుక్కలేదు

ఇంతలో పోలీసు నిలబడివున్న గొడుగుని సమీపించాం వికటంగా సెల్యూట్ చేసి "మీపేర్లు చెప్పండీ సార్స్" అన్నాడు. బింకంగా పేర్లు, అడ్రస్‌లు చెప్పాం. ఆ తర్వాత బతిమాలాడటం మొదలెట్టాం కాఫీ నీళ్లు ఆశచూపాం "నన్ను వూరికే మొహమాటపెట్టకండి" అన్నాడు ఆ క్రితంరోజున వాళ్ళకి కేసులేమీ పట్టుకోలేదని రిమార్కులు రాశారట అందువల్ల రోడ్డుకి అడ్డంగా నడిచేవాళ్ళమీదకూడా కేసు రిజిస్టరు చేస్తున్నాడట ఆఖరికి బ్రతిమాలగా బ్రతిమాలగా ఒక్కడ్ని వదిలాడు మా తాతలు దిగివచ్చారు. సరే అని అతిభయంగావున్న సూర్యారావుని వెళ్ళిపొమ్మన్నాం. వాడు అన్నదే తడవుగా వెళ్ళిపోయాడు మేం ముగ్గురం సైకిళ్లు నడిపించుకుంటూ, పోలీస్‌తో సహా పోలీసుస్టేషన్కి నడుస్తున్నాం

ఇంతలోకీ నాకొక ఐడియా తట్టింది అది మాభయ్యాకి రహస్యంగా చెప్పా "భలే! చాలా బాగుందిరా" అన్నాడు ఆ పోలీసుతో "ఏమండీ! మేంవున్నది ముగ్గురమే కదా? మా దగ్గరవున్నవి రెండే సైకిళ్లు మేం ముగ్గురం రెండు సైకిళ్ళమీద డబుల్సు రైడింగు చేశామని కేసు రిజిస్టరుచేయటం అసమంజసంగా వుంటుందేమో! ఒకడ్ని వదిలేశామని చెప్పటం మీకే ప్రమాదకరమేమో ఆలోచించుకోండి" అన్నాను "మీరు మాట్లాడకుండా నాతో రండి" అన్నాడు "మన ప్లాను సాగలేదురా" అని విచారపడుతూ కొంతదూరం నడిచేసరికి ఆ పోలీసు కోపంగా "మీలో ఎవరో ఒకరు వెళ్లిపోవచ్చు" అన్నాడు సుబ్బారావుతో "మా కొక ప్లానుందిరా! నీ సైకిలుని వదిలేసి వెళ్ళిపో" అన్నాను వాడు వెళ్లిపోయాడు

పోలీసు మాకేసి కోపంగా


సకల దంత వ్యాధులకు

కోతిమార్కు
నల్ల పండ్లపొడి



ప్రతిచోట
దొరకును

నోగి అండ్ కో., బొంబాయి-4
మద్రాసు బ్రాంచి:
87, చైనాబజార్ రోడ్, మద్రాసు-1

చూస్తూ నవ్వుతున్నాడు మాలో మేం నవ్వుకుంటూంటే ఆ పోలీసుకి కోపం మరీ ఎక్కువైంది ఇంతలో పోలీసుస్టేషను వచ్చింది లోపలికి వెళ్లాం. అతను సబ్ ఇనస్పెక్టరుదగ్గరకి వెళ్ళి మా మీద డబుల్సురైడింగ్ కేసు వున్నదని చెప్పాడు. ఆయన నవ్వుతూ "ఏమయ్యా నిజమేనా?" అన్నాడు ఆయన మా కాలేజీకి గేమ్సు, స్పోర్ట్సు జరపటానికి వస్తూ వుంటాడు అందువలన కొంచెం పరిచయం వుంది నేను నవ్వుతూ "సరే లెండి! మా దగ్గిర యిప్పుడువున్న సైకిళ్లెన్నో కనుక్కోండి" అన్నాను ఆ పోలీసు తడుముకోకుండా "రెండు" అన్నాడు మా సుబ్బారావు ఫకాలుమని నవ్వాడు నేను "ఏమండీ ఇనస్పెక్టరుగారూ! మా దగ్గరవున్నవి రెండుసైకిళ్లు మేము వున్నది యిద్దరం మేమిద్దరం ఆ రెండుసైకిళ్లమీదా డబుల్ రైడింగ్ చేశామంటే ఎంత absurd గా వుందీ! ఈపోలీస్ మామీదవున్న grudge తో ఈ కేసు పెట్టాడు" అన్నాను ఆ పోలీసు ముఖాన కత్తి వాటేస్తే నెత్తురుచుక్కలేదు. ఏదో చెబుదామనుకుంటున్నాడు మాట రావటంలేదు. బహుశా యిద్దర్ని వదిలేశినట్లు చెప్పబోయి అట్లా చెప్తే తనకి ప్రమాదం కలుగుతుందని ఆ చెప్పే ప్రయత్నం విరమించుకున్నట్లున్నాడు

ఆ ఇనస్పెక్టరు కొంచెం సేపు ఆలోచించి మేము చేసిన పని గ్రహించినట్లున్నాడు మావేపు తిరిగి నవ్వాడు. తర్వాత పోలీసుతో "ఏమయ్యా! ఇంత తెలివి తక్కువ కేసుపెట్టావు? ఇట్లాంటి కేసు ఇంకెప్పుడూ పట్టకు. నీవు చేసినపని నాకు తెలుసులే. మిగిలిన ఇద్దర్ని వదిలేస్తే వాళ్లిసైకిళ్ళు వదిలేసి వెళ్లిపోయారు కదూ! ఇంకెప్పుడూ ఇట్లా చేయకు. ఇంకా నీవు కొత్తకాబట్టి, మొదటి తడవ కాబట్టి నీకు వార్నింగు మాత్రమే యిస్తున్నా" అని మాతో "మీరు వెళ్ళండి" అన్నాడు Thanks చెప్పి తిరిగివచ్చేస్తున్నాం. ఆపోలీసుకూడా తలకాయ వంచుకుని వచ్చేస్తున్నాడు. మేము నవ్వుకున్నాం అతను "భలేవాళ్ళండీ" అన్నాడు

ఇక అప్పటినుంచీ ఆపోలీసు మాకు ఫ్రెండ్ అయ్యాడు ఎప్పుడు కనిపించినా ఒక చిరునవ్వుతో greet చేస్తూ వుంటాం

అన్నట్లు చెప్పటం మరిచా ఆ రోజున మావల్ల, ఆపోలీసుకి కాఫీ నీళ్లు మస్తుగా టిఫిను, గిట్టాయిలెండి ★


రెండు మహానగరాలు

Tale of Two Cities

అనువాదకులు:

శ్రీ తెన్నేటి సూరి

వెల: 3-0-0.

పోష్టుఖర్చు ప్రత్యేకం

ఆంధ్ర గ్రంథమాల,

మద్రాసు-1


## ★ మంచీ-చెడూ ★

(18 వ పేజీ తరువాయి)

విచారకరమైన వాస్తవస్థితిలోకి ఆమెలోని ప్రతి అణువూ విపరీతమైన ఉద్రేకంతో మేల్కొన్నది ఘోరుగ ఏడుస్తూ ఆమె భాస్కరం పట్టు వొదిలించుకుని అతని కాళ్ళమీద పడింది ఆమె నోటివెంబడి ప్రవాహంలా మాటలు రాసాగాయి, "నేను దిక్కులేనిదాన్ని యిపోయాను భాస్కరం! అమ్మా నాన్నా—దరిద్రంలో కొట్టుకులాడుతున్నారు—అటు పుట్టిల్లుపోయింది—ఇటు మెట్టినిల్లూ బుగ్గయిపోయింది నాకు—నేనింక ఎక్కడికిపోను భాస్కరం! నన్నూ మీ నాయనతోపాటే తగలేశెయ్ నాకు భూమ్మీద ఇంకే ఆశ లేదు భాస్కరం" అంటూ ఆమె బిగ్గరగా ఏడవ నారంభించింది

ఈ దృశ్యం చూసి చూడనట్లు పాండురంగ దహన సంస్కారానికి కావల్సిన ఏర్పాట్లు చేస్తున్నాడు తూర్పున దట్టమైన నల్లని మేఘాల్ని చీల్చుకుని సూర్యకిరణాలు అర్ధచంద్రాకృతిలో అనంతాకాశంలోకి విస్తరిస్తున్నాయి. పశ్చిమాన ఇంద్రధనుస్సు వెలిసింది తుంపర మాత్రం పడుతోనే వుంది

భాస్కర్రావు పద్మను లేవదీసి, "ఏడవకు పద్మా నీకు దిక్కులేకపోతే నేనులేనా! నా ప్రాణం ఉన్నంతవరకు నీకేం భరవాలేదు," అని వాత్సల్యంతో ఆమె తల నిమిరాడు ఆ క్షణాన వాళ్లిద్దరికీ రవంత శాంతి లభించింది

[ఇంకా వుంది]